# కాళరాత్రి

## శ్రీ దుర్గంపూడి సోమరాజు

౧

నాటిరాత్రి నా అనుభవదృశ్యాలు, ఇప్పటికీ నా కన్నులకు కనిపిస్తూనే వుంటాయి. అవి జ్ఞాపకంవచ్చి రాగానే ఒళ్ళంతా జలదరించి, ముచ్చెమటలుపోసి, గుండెలు "ధడ ధడా" కొట్టుకొంటాయి.

"దేవదాస్, దేవదాస్" అని ఊరంతా హడావుడీగా వుంది. నేనుకూడా ఫిలుంచూచి, యింటికి వస్తూవున్నాను. దేవదాస్ నిష్ఫలమైన జీవితం, పార్వతి అందచందాలు, అంతా నా కన్నులకు కట్టినట్లే వుంది. ఆలోచిస్తూ, నెమ్మదిగా యింటికిచేరి, సరాసరి నా పడక గదిలోకెళ్లాను. గది చిన్నది. అందులో నాకోసండీ చిన్నపట్టె మంచం. నా తలవైపునే క్రిందపరచి వున్న నా భార్య బెడ్డింగు. నా కాళ్ళవేపున గోడ. ఎడమవైపున ఒక బీరువా, అందులో నా చదువుకొనే పుస్తకాలు, దానిపైన కొన్ని మందు సీసాలు వున్నాయి. కుడివైపున బయటకు వెళ్ళటానికి ఓ ద్వారంవుంది. నా చిన్నగదిలో వున్న సామానంతా ఇదే. నేను గదిలోకివెళ్ళడంతోనే నవ్వుతు నా భార్య "సుపర్ణ" సినీమా విషయాలు అడగడం ఆరంభించింది. నేను చంద్రనటన, సైగల్ దీనదశ, ఫిలుం గొప్పతనం మొదలయిన వన్నీ ఏక్ దమ్మున ఏకరువుపెట్టాను. ఆమె చాలా సరదాగా వింది. తత్ఫలితం ఆవిడ ఆనందమే. ఎంత అమాయకురాలు! ఈ కబుర్లతో రాత్రి పన్నెండైంది. మే మిద్దరం నిద్రపోయాం.

౨

నేను పడుకోటానికి ముందే, దీపం చిన్నదిగా చేసి ఒకమూల పెట్టాను. దీపం వుందన్నపేరే గాని వెలుగు ఏమాత్రం లేదు. నాకు మాంచి నిద్రపట్టింది. ఎందుచేతో కాని అకస్మాత్తుగా రెండుగంటలకు నాకు మెలకువవచ్చింది. ఎందుచేత చెప్మా - నాకు ఏమాత్రం బోధపడడం లేదు. నిద్రావస్థలోంచి బైటపడ్డా. నా ఎడమ చేతి మధ్యవ్రేలు ఝుమ ఝుమ లాడుతూంది, గదంతా చీకటిగా వుంది. నా చెయ్యి మంచం మీద నుంచి క్రిందికి వ్రేలాడుతూన్నట్టు తెలిసికొన్నాను. మధ్యవ్రేలు నేలకు ఆనుకొని వుంది, గాభరాతో చెయ్యి పైకితీసి రెండవచేత్తో తడిమిచూచా. వ్రేలు తడిగా తగిలింది, ఒకటి రెండు బొట్లుకూడా మీదపడ్డాయి, వ్రేలంతా రక్తమయమై వున్నట్లు తోచింది, కళ్ళు పెద్దవి

చేసి చూచాను ఎర్ర ఎర్రగా కనుపించింది. వ్రేలు కొంచెం నెప్పిగాకూడా వుంది. పాము కరచిందేమో? నిజమే - ఈ బీరువా క్రింద నుంచి ఒకనాడు పాము వచ్చింది. నాకది తట్టాల్న జ్ఞాపకం వచ్చింది; ఇప్పుడేముంది? ఇక మిగిలింది నా మృత్యువు - ఇప్పుడు అకస్మాత్తుగా మృత్యువు నన్ను కబళిస్తుందా! అయ్యో! పిన్న వయస్కురాలగు నాభార్య, తల్లితండ్రులు వీళ్ళంతా ఏమయిపోతారో? అదిగో! మృత్యుదేవత భీకరాకారంతో నా యెదుట నృత్యం చేస్తోంది. చచ్చిపోతానా? అబ్బె! ఇక నన్ను బతకనిస్తుందీ! సరే, కాని ఆ పామును ఎందుకు చంపకూడదు. పాము జాడనీమాత్రం ఎట్లా అనుకోడం! చీకటైతేనేం, భయంతో భీతికాగాని ఏమీ కనబడలే, వ్రేలు నేలను పొడుచుకుంది - అబ్బా ఝుమ ఝుమ బాధ.

మంచం మాత్రం దిగకుండా జాగ్రత్త పడ్డాను లెండి. ధైర్యంచేసి దిగితే, తిరిగి మళ్లీ కాలుకరిస్తే, పామె పారిపోయి వుంటుంది! నల్లగా పొడుగ్గా వుండేదానిరూపం, ఆ పడగ, ఆ మిలమిల కదలిక, నా కన్నుల ఎదుటే వుంది. నేను దానిని చూస్తూనే వున్నాను - మృత్యువు వికటాట్టహాసంతో, నా నెత్తిమీద ఆడుతూ వుంది. ఇప్పుడేమి చెయ్యడం - హాస్పటల్; అది చాలా దూరంగా వుంది. రాత్రిసమయం దగ్గరలో బళ్లుకూడా లేవు, ఒకవేళ దోవలోనే ప్రాణం పోతుందేమో! ఎవరు చెప్పగలరు. నెమ్మదిగాలేచి, దీపం పెద్దదిచేసి అటు - ఇటు చూశాను - అంతా నిశ్శబ్దం. నా భార్యావంక తీనంగా వీక్షించాను - ఆమె నేలమీద పండుకొని, నిద్రపోతూంది. ప్రసన్నంగా, కళ కళ లాడు మోముతో, చిరునవ్వుతో పడుకుంది. పాడుపాము! నేలమీద పడుకున్న దానిని కరవలేదు. మంచంమీద పడుకొన్న నన్నే కరిచింది. నామీద పగపట్టిందేమో! దైవ యత్నం మనమేం చేయ్యగలం. గుండెలు దిటవుపరచుకొని లైటుతో పామును వెతకటం ప్రారంభించా - అట్లాంటి భయానక సమయంలో, మీరు అంతటి సాహసప్పని చేయగలరా? ఈ గాభరాలో నాకాలు మంచినీళ్ల గ్లాసుకు తగిలి "గణగణా" దొర్లింది. ఆ చప్పుడుకు నాభార్య ఉలిక్కిపడి లేచింది. నా భీషణాకారం, వెలవెలలాడు ముఖంచూసి ఒక్కసారి గాభరాపడింది. ఆమె నావంక ప్రశ్నాత్మక దృష్టితో చూసింది. కంపిస్తూవున్న నా వ్రేలి నామెకు చూపిస్తూ - "పాముకరచింది!" అని అరచాను. ఆమాట వింటంతోనే ఆమె ధడాల్ని పడిపోయింది. ఆ ధ్వనివిని ప్రక్కగదిలోవున్న మా అమ్మ పరిగెత్తుకొచ్చింది. పడిన నాభార్య ఒక్కసారిగా లేచి నుంచుంది.

## 3

ఇంకేముందండోయి వారిని "పాముకరచింది" అని నాభార్య కంగారుతో చెప్పింది మా అమ్మతో! ఆమాటవిని హడావుడిగా మానాన్న కూడా పరిగెత్తుకొచ్చాడు. 'పాము కరచింది! పాము కరచింది!!' అన్నే మాటలతో, గది అంతా ప్రతి ధ్వనిస్తోంది. ఇల్లంతా గంద్రగోళంగా వుంది. ఎవళ్ళకు ఏమీ తోచడం లేదు! అందరూ నా వ్రేలిని, నన్నూ చూస్తూ భయపడసాగారు. టైమెంత - మూడైంది. నేను గంటలు లెక్కపెడుతున్నా ఇక ఇప్పుడు ఏమందు వేసుకున్నా లాభంలేదు. పాము కరచి

అప్పుడే గంటయింది, విషం దేహమంతా వ్యాపిం
చుంటుంది. పాము కరచినవాళ్ళకు నిద్రవచ్చి,
ఆ నిద్రలోనే చనిపోతారని విన్నాను. నాకూ
డా నిద్రవస్తూంది – అయ్యో – నిద్రవస్తూంది.
ఇక చావు తప్పదు. నేను గుండెలమీద చేయి
వేసుకున్నా – గుండెలు జోరుగా కొట్టుకొంటు
న్నాయి. నరాలన్నీ పటుత్వం తప్పినై. ఎటు
చూసినా మృత్యుదేవతే కనిపిస్తోంది. అయ్యో,
ఎంత భయానకం, కళ్లు గుంటలుపడినై, నిద్ర
వస్తూంది. అట్లయితే గంట అరగంటలో వీళ్లం
దర్నీ వదలి వెళ్లిపోతాను కాబోలు? నా
ప్రియ సుపర్ణ, నా ముద్దుభార్య ఒకమూల
కూర్చుని, ఏడుస్తూంది. నా తల్లితండ్రి ఉప
చరణచేస్తూ, నా భావిగతికి దుఃఖిస్తున్నారు.
నా చెల్లెలు గదిలో అటు – ఇటు, బీరువా
వైపు, మంచంవేపూ చూస్తూంది! నేను
వాళ్లందరి మొఖాలుచూశా! వాళ్లంతా విచా
రంగా వున్నారు. వాళ్ళను కొంటున్నారేమో–
మృత్యువు సమీపించిందని. నే హతాశుణ్ణయి
పోయా. మా అమ్మ వేపాకు, కలికం, ఏవో
మందులు తెచ్చింది. నా చెల్లెలు రెండో
లాంతరు తీసుకొని, వెతకుతూంది, ఒక లాంతరు
నావద్ద పెట్టారు, నేను నేలమీదే కూర్చున్నా.
ఇంతలో నా చెల్లెలు ఒకపెద్ద కేకవేసింది,
పామేమో అనుకున్నాం, ఆమె నా మంచం
కింద చూస్తూ పకపకా నవ్వుతూ, మమ్మలను
పిలుస్తూంది. ఎందుకో మాకు తెలియలేదు.
ఒక్కసారి మేమంతా రెండో లాంతరు తీసు
కొని మంచం దగ్గరకు వెళ్లిచూశాం, నా
ఆశ్చర్యానికి అంతులేక పోయింది. నా మంచం
దగ్గరనున్న బీరువామీద నుంచి ఒక ఎర్ర
రంగు సీసా – కోబ్రా రెడ్ బూటుపాలిష్ సీసా
మంచందగ్గర పడివుంది, ముక్కలైపోయింది.
అదిచూచి మా అమ్మ మహా తెలివితో,
ఉత్సాహంగా నా వ్రేలు చూసింది. దానిమీద
ఎక్కడా పాముకాట్లే లేవు; చిన్నగాజు
పెంకుగుచ్చుకొని వుంది. పాలిష్ అంటుకు
పోయింది. గుడ్డతో వ్రేలు తుడిచారు. స్వచ్ఛం
గా వుంది వ్రేలు. పదునుగల చిన్న గాజుముక్క
మాత్రం గుచ్చుకొని వుంది.

* * *

నేను ఆనాడు తెల్లవారేవరకు నిద్రపోలేదు.
ఇప్పటికూడా జ్ఞాపకం వస్తే – ఆ కాళరాత్రి
ఘటన అంతా నా కళ్లకు కనపడుతూనే వుం
టుంది.

ఈ సంఘటనాన్ని విని దయతో నవ్వబోకండి.


డోంగ్రేగారి బాలామృతము



బలహీనులైన బిడ్డలకు బలపుష్టి నిచ్చును
అన్ని చోట్లా దొరుకుతుంది.